క్లుప్తంగా

హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సర్పంచ్ బచ్చల భారతి

మణుగూరురూరల్: తమ హక్కులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సమితిసింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ బచ్చల భారతి తెలిపారు. ఆదివారం సమితిసింగారం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో సామాజిక కార్యకర్త వై.ప్రభాకర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్ బచ్చల భారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీ మహిళలకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. నేటి సమాజంలో ప్రతీ మహిళలకు విద్య చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు గౌసియా, శ్రీదేవి, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు, మైనార్టీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా రాంబాబు



ములకలపల్లి: ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ములకలపల్లికి చెందిన వ్యాపారి అత్యం రాంబాబు ఎన్నికయ్యారు. నర్సాపురం శివారులోని కోటిమ్మతల్లి ఆలయం వద్ద కొదుమూరి వీరగోపాల్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంబాబుతోపాటు వైస్‌ప్రెసిడెంట్‌గా చారుగుండ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి రమేశ్, కోశాధికారిగా ఓబులశెట్టి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయవరపు నరేశ్‌లు నియమితులయ్యారు. సంఘ మండల మహిళా అధ్యక్షురాలు పద్దం సుజాత, యువజన విభాగం మండల అధ్యక్షుడు అత్యం సాయి, ములకలపల్లి పట్టణ యువజన అధ్యక్షుడు ఓబులశెట్టి ప్రదీప్, పుల్లూరి జయశ్రీ, వనమా మణి, పద్దం బుజ్జి, బిక్కుమళ్ల సుధాకర్, ప్రభాకర్, వేణు, వనమా శ్రీను, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కోలుకోవాలని పూజలు


కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు నిర్వహిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: తొంటి విరిగి సర్జరీ అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ దుమ్ముగూడెం మండలంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ రేగుపల్లి గ్రామకమిటీ ఆధ్వర్యంలో నర్సాపురంలోని జ్యోతిర్లింగ చిన్న అరుణాచల ఆలయంలో ఈ పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో సహకార సంఘ డైరెక్టర్ కాలువ పూర్ణయ్య, సోషల్ మీడియా అధ్యక్షుడు దామెర్ల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జెట్టి రామకృష్ణ, నాయకులు రాయిపూడి శ్రావణ్, అనిల్, కృష్ణంరాజు, వంశీ, పూర్ణయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో నేడు రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో నేడు(సోమవారం) రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు జారే ఆదినారాయణ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10లక్షల రూపాయాలకు పెంచగా, దీనిని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని అన్నారు.

శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నేడు (సోమవారం) శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాస శివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణం జరిపించడం జరుగుతుందన్నారు. స్వామి వారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

హార్వెస్టర్లకు భలే గిరాకీ!

- తుపానుతో వారం రోజులుగా నిలిచిన వరికోతలు
- ఒకేసారి ఊపందుకున్న కోతలతో ఏర్పడిన కొరత
- ఇదే అదునుగా ధరలు పెంచిన హార్వెస్టర్ల యజమానులు


వరికోస్తున్న చైన్ మిషన్ హార్వెస్టర్

బూర్గంపాడు: వరికోత యంత్రాల(హార్వెస్టర్ల)కు ప్రస్తుతం ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఇటీవల మిచాంగ్ తుపానుతో జిల్లాలో రెండురోజుల పాటు ఏకధాటిగా వర్షాలు కురిశాయి. దీంతో వారం రోజులుగా వరికోతలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు వరి మాగాణులు నేలకొరిగాయి. కొన్నిచోట్ల వరిపంట చాప చుట్టినట్లుగా పడిపోయింది. భారీ వర్షాలతో వరిమాగాణులు జలమయమయ్యాయి. కోతకు వచ్చిన వరిపంట నీటిపాలవటంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పటికీ వరి మాగాణులలో వర్షపు నీరు నిలిచివుంది. ఇప్పట్లో వరి మాగాణులు ఆరుదల పరిస్థితులు లేవు.

చైన్ హార్వెస్టర్లే కావాలి..

దీంతో రైతులు చైన్‌తో నడిచే హార్వెస్టర్ల కోసం వెతుకుతున్నారు. మాగాణులన్ని కోతకు రావటం, మాగాణులలో నీరు, బురద ఉండటంతో చైన్‌తో నడిచే హార్వెస్టర్లకు(ట్రాక్)లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. టైర్లతో నడిచే హార్వెస్టర్లు మాగాణులలో దిగే పరిస్థితులు ఉండవు. వీటితో పని ముందుకు సాగదు. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన వందలాది టైర్ల హార్వెస్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఇదే సమయంలో చైన్‌తో నడిచే హార్వెస్టర్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.

ఎకరాకు 2వేలు అదనపు భారం..

చైన్ హార్వెస్టర్ల యజమానులు గతంలో గంటకు రూ.3 వేలు తీసుకునేవారు. ఇప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ హార్వెస్టర్ల రేటును గంటకు రూ.3500 నుంచి రూ.4వేల వరకు నిర్వాహకులు పెంచారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ఎకరాకు కనీసం రూ.2వేల వరకు అదనపు ఖర్చు పెరిగింది. అయినప్పటికీ రైతులు వరికోత తరుణం మించిపోతుండటంతో ఎక్కువ ధరలు చెల్లించి చైన్ మిషన్ హార్వెస్టర్లను వినియోగిస్తున్నారు. జిల్లాలో ఈ రకం హార్వెస్టర్లు తక్కువగా ఉండటంతో పక్క జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఈ హార్వెస్టర్లను రప్పిస్తున్నారు. జిల్లాలో వరికోత యంత్రాల నిర్వాహకులు లక్షల రూపాయలు ముందస్తుగా చెల్లించి చైన్ మిషన్ హార్వెస్టర్లను జిల్లాకు తెప్పిస్తున్నారు. అయినప్పటికీ మిషన్ల కొరత తీరటం లేదు.

పశుగ్రాసానికి గడ్డుకాలం..

తుపాను తరువాత కోస్తున్న వరిలో దాదాపు 90శాతం మేరా చైన్ మిషన్ హార్వెస్టర్లనే వినియోగిస్తున్నారు. అయితే చైన్ హార్వెస్టర్‌తో కోసిన వరి పశుగ్రాసానికి పనికిరాదు. దీంతో ఈ ఏడాది జిల్లాలో వరిగడ్డి సమస్య కూడా ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పశువులు ఉన్న రైతులు వరిగడ్డి కోసం ఆందోళన చెందుతున్నారు. వరిగడ్డి కోసం ఆలోచన చేస్తే తుపానుకు నేలవాలిన వరిపంట చేతికందే పరిస్థితులు లేవు.

పంట చేతికొచ్చేనా..

ఇప్పటికే చాలాచోట్ల నేలవాలిన వరి మొలకెత్తుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరి కోతల తరుణంలో వచ్చిన తుపాను రైతులను అన్నివిధాల నష్టాన్ని కలిగించింది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తారా లేదా అనే ఆందోళన కూడా రైతులలో వ్యక్తమవుతోంది. ఈ వానాకాలం వరిసాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితులు లేవు. తుపాను నేలవాలి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పరిహారం ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మిషన్ల కొరతతో రేట్లు పెంచారు



తుపానుతో వరి మాగాణులు నేలవాలాయి. ఇరవై రోజులు గడిస్తేగాని మాగాణులు ఆరే పరిస్థితులు లేవు. దీంతో రైతులందరు చైన్‌మిషన్ల(ట్రాక్)ల కోసం ఎగబడుతున్నారు. యాసంగి పంట ఆలస్యమవుతుందని రైతులు ట్రాక్ మిషన్ల కోసం పోటీ పడుతున్నారు. దీంతో మిషన్లకు డిమాండ్ పెరిగింది. గతంలో గంటకు రూ 3వేలు తీసుకుంటే ఇప్పుడు 4వేలు డిమాండ్ చేస్తున్నారు.

– నన్నూరి వెంకటేశ్వరరెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం

వరద నీటిలో క్రీడా మైదానం


వరదనీటితో నిండి ఉన్న క్రీడా మైదానం, ఆటల పరికరాలు

అశ్వారావుపేటరూరల్: గత ప్రభుత్వంలో క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన ఓ క్రీడా మైదానం వరదనీటిలో మునిగింది. అశ్వారావుపేట మండలం గుర్రాల చెరువు గ్రామ పంచాయతీకి సంబంధించిన క్రీడా మైదానాన్ని గతంలో ఈదుల చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేశారు.

వర్షం కురిస్తే ఈ మైదానంలో నీళ్లు చేరుతున్నాయి. తాజాగా వచ్చిన మిచాంగ్ తుపానుతో చెరువు నిండిపోగా, వరదనీరు శిఖం భూముల్లో ఉన్న క్రీడా మైదానాన్ని ముంచేశాయి. కాగా క్రీడా స్థలాన్ని ఈ ప్రాంతంలో ఎంపిక చేసి, కేటాయించడంలో స్థానిక రెవిన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడా మైదానంలో వరదనీళ్లు నిలిచిపోవడంతో ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వాలిబాల్ నెట్, ఇతర ఆట పరికారాలు సైతం వరదనీటిలోనే ఉన్నాయి. ఇలా ఉంటే ఈ మైదానంలో ఆటలు ఆడేదెలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన


సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంక్షేమ సంఘం నాయకుడు

దమ్మపేట: దమ్మపేట గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామ శివారు నల్లకుంటలోని పామాయిల్ క్షేత్రంలో నిర్వహించిన ఈ వనసమారాధనకు గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల నుంచి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆడ, మగ వారికి వేర్వేరుగా ఆటలు, పాటలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖులు హాజరై మాట్లాడారు. అనంతరం వనసమారాధనకు హాజరైన అందరూ విందు భోజనాన్ని ఆరగించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎన్డీ, రైతు కూలీ సంఘం నాయకులు


చర్ల: సమావేశంలో మాట్లాడుతున్న కల్లూరి వెంకటేశ్వరరావు

గుండాల: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయారని ఈ రైతులను కొత్తగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)రాష్ట్ర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కాచన పల్లి గ్రామంలో గుండాల, ఆళ్లపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పంట పండిస్తేనోటి దగ్గరకు వచ్చిన పంట మిచౌంగ్ తుపాను కారణంగా నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు మిర్చికి ఎకరాకు రూ.50వేలు, మొక్కజొన్నకు 25వేలు, వరికి 25వేలు, పత్తికి 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం గుండాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ప్రదర్శనకు పంట నష్టపోయిన రైతులు వ్యక్తిగత దరఖాస్తులతో వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచ్ కొమరం సీతారాములు, న్యూ డెమోక్రసీ నాయకులు అరేం నరేష్, పర్శక రవి, పూనం రంగయ్య,గడ్డం లాలయ్య, ఎస్.కె అజ్గర్, కొమరం సత్యనారాయణ, బచ్చల సారన్న,జరుపుల కిషన్,బత్తిని సత్యం, ఈసం మంగన్న, దుగ్గి రియాజ్, బానోతు లాలు, బుక్య వెంకన్న, ఎనగంటి చిరంజీవి, ఎనగంటి లాజర్, బొమ్మెర వీరన్న, కల్తీ మల్లయ్య, మోకాళ్ళ బుచ్చయ్య, గోగ్గల శ్రీను, ఎల్లబోయిన ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన నియోజకవర్గ రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చర్ల మండలంలో పలు గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

తుపాను వల్ల వరి, మిర్చి, పత్తి పంటలతో పాటు అపరాల పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన అన్నారు. మిర్చికి ఎకరాకు సుమారు రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టిన రైతులు.. పంట కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వచ్చిన తుపాను తీవ్రంగా నష్టపరిచిందని అన్నారు. మరికొందరు కోసిన ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోయగా వర్షంతో తడిసి మెలకెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శివర్గ సభ్యులు పోతయ్య, రాము, నాగేశ్వరరావు, నాగరాజు, ముత్తయ్య, తిరుపతిరావు, శ్రీను, రాజు, పార్వతి, నర్సమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో తాగునీటికి కటకట


మరమ్మతులు చేసేందుకు మోటారును బయటకు తీయిస్తున్న అధికారులు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గడిచిన ఇరవై రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొని ఉండగా, కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ సమీపంలోని పెదవాగులో బోరు వేసి, మోటారు ఏర్పాటు చేసి గతకొన్నేళ్లుగా గ్రామానికి తాగునీరు అందిస్తుండగా, ఈ బోరు మోటారు 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. మోటారును మరమ్మతులు చేసేందుకు సుమారు 10 రోజుల క్రితం బయటకు తీసినప్పటికీ నేటికి తిరిగి బిగించలేదు. దాంతో ఈ మోటారు గురించి పట్టించుకునే వారే లేకుండా పోయినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామానికి మిషన్ భగీరథ పథకం కింద రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు అందిస్తుండటంతో స్థానికులు వ్యవసాయ బోర్లు, చేతి పంపులపై ఆధార పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బాబును వివరణ కోరగా, మోటారు మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని అన్నారు. మోటారు మరమ్మతులకు నిధులు కొరతతో మరమ్మతులు చేయించడం ఆలస్యమైనట్లు తెలిపారు.

విజ్ఞాన యాత్రకు తరలిన రైతులు


విజ్ఞాన యాత్ర బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కుమార్

అశ్వారావుపేటరూరల్: కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లికి చెందిన 20 మంది కొబ్బరి రైతులు విజ్ఞాన యాత్రకు ప్రత్యేక బస్సులో ఆదివారం తమిళనాడుకు తరలివెళ్లారు. ఈ మేరకు విజ్ఞాన యాత్ర బస్‌ను ఏపీలోని విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజ్ఞాన యాత్ర అశ్వారావుపేట నుంచి తమిళనాడు రాష్ట్రం పొల్లాచి వరకు సాగనున్నట్లు, యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లోగల కొబ్బరి తోటలు, వాటిని సాగు పద్ధతులు, అనుబంధ పరిశ్రమలు, ఉత్పత్తుల గురించి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కాగా విజ్ఞాన యాత్ర గురించి సంబంధిత బోర్డు బాధ్యులు రహస్యంగా ఏర్పాటు చేశారని, చాలా మంది రైతులకు దీనిపై సమాచారం ఇవ్వలేదని విమర్శలు వెల్లువెత్తాయి. కొద్దిమంది రైతులకే విజ్ఞాన యాత్ర పేరిట నిధులు వృథా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో రైతులు ఆలపాటి రాము, కొక్కెరపాటి పుల్లయ్య, రామచంద్రరావు, భూక్యా ప్రసాద్, సాయి, బోర్డు సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: చర్లలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి ఇక్కడ జరిగే వారపు సంతకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుంటారు.

అయితే వీరి మాటున మావోయిస్టులు మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం సెంటర్లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్‌పార్టీ పోలీసులు మోహరించారు. అనుమానితులుగా భావిస్తూ పలువురుని అదుపులోకి తీసుకున్నారు. విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ బి.రాజగోపాల్, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిల నేతృత్వంలో తనిఖీలు కొనసాగగా.. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జలకళ కానే కాదు..


నీటి వనరుగా కనిపిస్తున్న పొగాకు క్షేత్రం

అశ్వారావుపేటరూరల్: ఈ చిత్రం చూడటానికి ఏదో సాగునీటి చెరువులా కనిపిస్తోందా.. అంతే కాదు చెరువంతా జలకళలా ఉట్టిపడుతున్నట్లు అనిపిస్తోందా.. కానీ అది నిజం అనుకుంటే పొరపాటే. అశ్వారావుపేట సమీపంలోని పేటమాలపల్లి వద్ద ఓ రైతు పొలంలో పొగాకు పంటను ఐదు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ పంట మొక్కదశలో ఉండగా, కలుపు నివారణ కోసం పొలం అంతా మల్చింగ్ షీట్లు పరిచారు. దాంతో ఈ మల్చింగ్ షీట్లను దూరం నుంచి చూస్తే చూపరులకు ఓ చెరువులా.. దానిలో జలకళ సంతరించుకున్నట్లుగా కనిపిస్తోంది. కానీ దగ్గరగా వెళ్లి చూస్తేనే మల్చింగ్ మయగా అర్థమవుతుంది. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

ఆరోగ్యానికి దగ్గరగా ఆదివాసీలు

- ఇప్పటికీ దంపుడు బియ్యమే వినియోగం
- ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తున్న ధాన్యం


వడ్ల నుంచి బియ్యాన్ని వేరు చేస్తున్న దృశ్యం


వడ్లను దంచుతున్న ఆదివాసీ మహిళలు

చర్లరూరల్: ప్రస్తుత కాలంలో అన్నింటికంటే ముఖ్యమైనది ఆరోగ్యమే. మనం నిత్యం తినే ఆహారంలో కాలక్రమేణా అనేక మార్పులు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం రోజూ తినే ఆహారం వల్ల అనేక జబ్బులు వస్తాయని తెలిసినప్పటికీ మనం మన ఆహారపు అలవాట్లు మార్చుకునే ప్రయత్నం కూడా చేయలేక పోతున్నాం.. కానీ సమాజానికి ఎంతో దూరంగా ఉన్నప్పటికీ ఆదివాసీలు మాత్రం నేటికీ ప్రతీరోజు ఆరోగ్య కరమైన ఆహారాన్నే సేకరిస్తున్నారు. అందులో భాగంగా దంపుడు బియ్యాన్నే తింటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఎటువంటి పురుగు మందులనూ వాడకుండా తాము నమ్ముకున్న అడవిలోనే ధాన్యాన్ని పండించుకుంటున్నారు. ఆ ధాన్యాన్ని ఇంట్లోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న రాతి రోట్లో దంచడం ద్వారా వచ్చే బియ్యాన్ని రోజూ వండుకుని తింటారు. దంపుడు బియ్యం తినడం వల్ల ఎటువంటి శారీరక రోగాలు రావని ఆదివాసీలు చెబుతారు. ఎన్నో ఏళ్లుగా నిత్యం ప్రతీరోజు వడ్లను రోట్లో దంచిన తర్వాత వచ్చే పాలిష్ లేని బియ్యాన్ని వాడుతున్నారు. సహజ సిద్ధంగా పండిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యాన్ని తింటున్నారు.

నేటికీ దంపుడు బియ్యమే..



ఎటువంటి పురుగుమందులు లేకుండానే పంటను పండిస్తాము. ఆ పంట ద్వారా వచ్చిన వడ్ల నుంచే తినడానికి ధాన్యంగా ఉపయోగిస్తాము. ఈ ధాన్యాన్ని సహజ సిద్ధంగా దంచి ఒడేందుకు సిద్ధ పరుస్తాం.

– మడివి ఇడమయ్య, ఎర్రంపాడు

ఈ బియ్యమే మాకు అలవాటు



తరతరాలుగా మేము దంపుడు బియ్యాన్నే తింటున్నాము. మాకు ఎటువంటి అలసట ఉండదు. అంతే కాకుండా ఆకలికి తట్టుకునే శక్తి ఉంటుంది. ఈ ఆరోగ్యానికి కారణం మేము పాటించే ఆహార అలవాట్లే. ఇందులో దంపుడు బియ్యం ఒకటి.

– సోడి రాజు, ఎర్రంపాడు